# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేల్చుదాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

హైదరాబాద్ శుక్రవారం 26.01.2024


# స్టార్ హీరో కొత్త పార్టీ

సినిమాలకు గుడ్ బై చెబుతాడా?


## తమిళనాడులో రాజకీయాల్లో హాట్ టాపిక్



**తెలంగాణవీణ, డైనమిక్ :** తమిళనాడులో రాజకీయాలు ఎప్పుడూ హాట్ టాపిక్ గా మారతున్నాయి.. ఇప్పుడు మరో కొత్త పార్టీ రాబోతుందని వార్తలు వినిపిస్తున్నాయి.. ఇలయ దళపతిగా తమిళనాట అశేష అభిమానం సంపాదించుకున్న విజయ్ త్వరలో కొత్త పార్టీ ప్రారంభించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.. మక్కల్ ఇక్కయం నిర్వాహకులతో సమావశాన్ని ఏర్పాటు చేశారు.. ఈ సమావేశంలో అందరు కొత్త పార్టీ పెట్టాలని డిమాండ్ చేశారు.. అంతేకాదు హీరో విజయ్ కూడా రాజకీయాల పైనే చర్చలు జరపడంతో ఈ వార్తలకు ఆజ్యం పోసినట్లు అయ్యింది.. ఇక ఇప్పటికే సీనియర్ హీరోలు రజినీకాంత్, కమల్ హాసన్ లు వెనుకంజ వేశారు.. వీళ్లిద్దరి తర్వాత ఆ స్థాయి అభిమానం ఉన్న విజయ్ రాజకీయాల్లోకి వస్తే ప్రజలు ఏ విధంగా ఆదరిస్తారో చూడాలి.. ఇక రాజకీయాల్లోకి వస్తే.. సినిమాలకు గుడ్ బై చెప్తాడా అనే సందేహాలు కూడా వస్తున్నాయి..

# అస్వస్థతకు గురైన మాజీ హోం మంత్రి

# మొహమ్మద్ అలీ..



- గణతంత్ర వేడుకల్లో అపశృతి.. స్పృహ తప్పి పడిపోయిన తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి
- తెలంగాణ భవన్ లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన అస్వస్థతకు గురై కింద పడ్డారు.
- వెంటనే ఆయనను పార్టీ శ్రేణులు ఆసుపత్రికి తరలించారు.



# దేశ రాజధానిలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు..



- ఢిల్లీలో జరిగే పరేడ్ లో మొత్తం 25 శకటాల ప్రదర్శన..
- మూడేళ్ల తర్వాత తొలిసారి రిపబ్లిక్ డే పరేడ్ లో తెలంగాణ శకటం..
- డెమొక్రసి ఎట్ గ్రాస్ రూట్స్ పేరుతో తెలంగాణ శకటం..
- తెలంగాణ శకటంపై చాకలి ఐలమ్మ, కొమురం భీం, రాంజీ గోండు విగ్రహాలు..
- డిజిటల్ క్లాసుల థీమ్ తో ఏపీ శకటం..
- ఏపీ విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన మార్పులపై శకటం..
- 16 రాష్ట్రాలు, 9 కేంద్ర పాలిత ప్రాంతాల శకటాల ప్రదర్శన..
- గణతంత్ర వేడుకలకు ఢిల్లీలో భారీగా బందోబస్తు..

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

## అధ్యక్షతన సమావేశం...





**తెలంగాణవీణ, డైనమిక్ :** పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సన్నద్ధమవుతోంది. గెలిపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికకు తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కేడర్ బలహీనపడింది. ఈ నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనైనా మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయా పార్లమెంట్ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. పార్టీ శ్రేణులను ఉత్తేజపరుస్తూ ఎన్నికల మూడ్‌లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కార్యకర్తలను చైతన్య పరిచారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ప్రభుత్వంపై పోరాటం చేయాలని శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తాజాగా ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కూడా రంగంలోకి దిగారు. గత కొంత కాలంగా తుంటి మార్పిడితో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలతో పాటు దేశంలో చోటుచేసుకున్న రాజకీయాలను ఎప్పటికప్పుడు కేసీఆర్ తెలుసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ఎంతో సమయం లేకపోవడంతో ఎలాగైనా మెజార్టీ సీట్లలో విజయం సాధించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా కేసీఆర్ అధ్యక్షతన పార్లమెంటరీ పార్టీ సమావేశమైంది. గజ్వేల్ లోని ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో భేటీ అయ్యారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుపై నేతలతో మేథోమదనం చేశారు. ఈ సందర్భంగా నేతలకు కేసీఆర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి కేటీఆర్ కూడా హాజరయ్యారు.

# 28న సీఎంగా నితీష్ ప్రమాణస్వీకారం.!

## బీహార్‌లో జేడీయూ-బీజేపీ ప్రభుత్వం..



**తెలంగాణవీణ, డైనమిక్ :** బీహార్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఆర్జేడీ-జేడీయూ-కాంగ్రెస్ ఉమ్మడి ప్రభుత్వమైన మహాఘటబంధన్‌కి తెరపడింది. మరోసారి నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ, తన పాత మిత్రుడు బీజేపీతో కలిసి అధికారం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు జనవరి 28న జేడీయూ-బీజేపీల ప్రభుత్వం కొలువుదీరే అవకాశం ఉందని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాజీ బీహార్ సీఎం, సోషలిస్ట్ నేత కర్పూరీ ఠాకూర్‌కి భారతరత్న ఇవ్వడంతో ఆ రాష్ట్ర రాజకీయాల్లో వేగంగా పరిణామాలు మారాయి. దీనిపై సీఎం నితీష్ కుమార్ ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత లాలూ కుమార్తె రోహిణి ఆచార్య, నితీష్‌ని ఉద్దేశిస్తూ పరోక్షంగా ట్వీట్స్ చేయడంతో ఈ వివాదం కాస్త పెద్దదైంది. దీంతో లాలూ నేతృత్వంలోని ఆర్జేడీకి, జేడీయూకి చెడింది.

# మెగాస్టార్‌కు

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు



**తెలంగాణవీణ, డైనమిక్ :** మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సభ్యులు మాత్రమే కాదు ఆయన అభిమానులందరూ ఇప్పుడు సంతోషంలో మునిగిపోయారు. ఎందుకంటే భారతదేశవ్యాప్తంగా రెండో అత్యున్నత పురస్కారంగా చెప్పుకునే పద్మ విభూషణ్ అవార్డుని మెగాస్టార్ చిరంజీవికి ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం మరి కొన్నాళ్లలో ఆయన భారత రాష్ట్రపతి ద్రౌపది చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోబోతున్నారు. ఇక ఈ విషయం తెలిసిన తర్వాత ఆయనకు సోషల్ మీడియా ద్వారా అనేకమంది అభిమానులు సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# బీఆర్ఎస్- గవర్నర్ తమిళిసై మధ్య పెరుగుతున్న గ్యాప్..



**తెలంగాణవీణ, డైనమిక్ :** బీఆర్ఎస్, గవర్నర్ తమిళిసై మధ్య గ్యాప్ మరింత పెరుగుతోంది. రిపబ్లిక్ డే ప్రసంగంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలు మళ్లీ చిచ్చురేపాయి. గవర్నర్ తమిళిసై వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఘాటుగా స్పందించింది. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. జనగామ జిల్లా BRS పార్టీ కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్, జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తమిళిసై ఒక గవర్నర్ అని మర్చిపోయి గణతంత్ర దినోత్సవ వేదికను రాజకీయ వేదిక చేసుకొని మాట్లాడారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో అనేక తప్పులు జరిగాయని.. సరిగ్గా పని చేయలేదని మాట్లాడడం సరికాదన్నారు. ఆ ప్రభుత్వంలో ఉన్న గవర్నర్ కూడా ప్రభుత్వ వైఫల్యాలకు బాధ్యురాలే అవుతారని అన్నారు. రాజ్యాంగం పట్ల అవగాహన లేని వారిని గవర్నర్ చేస్తే ఏ విదంగా ఉంటుందో నిదర్శనమే తమిళి సై అని విమర్శించారు. ఆ మాత్రం ఇంగిత జ్ఞానంలేని వారిని గవర్నర్ గా నియమించాకూడదన్నారు. గవర్నర్ వ్యవస్థ దుర్వినియోగం అవుతున్నందునే గతంలో గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని ఎన్టీఆర్ డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు తనకు కూడా గవర్నర్ వ్యవస్థను రద్దు చేస్తే మంచిదని అనిపిస్తోందన్నారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అని మర్చిపోయి ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని కడియం శ్రీహరి ఆరోపించారు. చార్లెస్- శోభరాజ్, బిల్లా-రంగా అని బీఆర్ఎస్ వారిని విమర్శిస్తున్న రేవంత్ చరిత్ర, ఆయనపై ఉన్న కేసుల గురించి ప్రజలకు తెలియదా..? అని ద్వజమెత్తారు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక బిల్లులను గవర్నర్ తొక్కిపట్టారని ఆరోపించారు. గవర్నర్ తన పదవికి రాజీనామా చేసి, బీజేపీలో చేరి మాట్లాడితే మంచిదన్నారు.

# మేడారంలో జోరుగా ముందస్తు మొక్కులు

- మేడారంలో ముందస్తుగా మొక్కుల చెల్లించుకుంటున్న భక్తులు....
- భక్తుల తాకిడితో కిటకిటలాడుతున్న వన దేవతల గద్దెలు



**తెలంగాణవీణ, డైనమిక్ :** అతిపెద్ద గిరిజన జాతరగా ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రసిద్ధిగాంచింది. ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భారీగా భక్తులు తరలి వస్తారు. వచ్చే నెలలో మహా జాతర జరగనుంది. ఇప్పట్నుంచే నుంచే మేడారంలో భక్తుల తాకిడి మొదలైంది. మేడారంలో ముందస్తు మొక్కుల చెల్లింపులు కొనసాగుతున్నాయి. సమ్మక్క, సారలమ్మ ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారుతున్నాయి. మహా జాతరకు సమయం దగర పడుతుండడంతో.. అధికారులు ఏర్పాట్లు పూర్తిచేయడంపై దృష్టి సారించారు. ఆర్టీసీ 6వేల బస్సులు నడుపనుంది. సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకునేందుకు పోటెత్తుతున్నారు. మేడారం జాతరకు సంబంధించిన పనులకు ఈసారి గుత్తేదారులు తక్కువగా టెండర్లు వేశారు. పనులు నెమ్మదించాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పనులు పూర్తి చేస్తామని ఐటీడీఏ పీవో అంకిత్ తెలిపారు. మరోవైపు వారం పది రోజుల్లో.. మేడారంలో పనులన్నీ పూర్తవుతాయని.. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ తెలిపారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం మహా జాతర.. ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో.. ఆయన పరిశీలించారు. వన దేవతలను దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. మేడారంలోని సమక్క భవనంలో అధికారులతో సమీక్షలో పాల్గొన్నారు. భక్తులు అధికంగా ఇప్పటి నుంచే వస్తున్నందున పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని.. అధికారులతో సమీక్ష అనంతరం శరత్ పేర్కొన్నారు.

# అయోధ్యకు వెళ్లే బస్సులు బంద్



**తెలంగాణవీణ, డైనమిక్ :** అయోధ్య బాలక్ రామ్ మందిర్‌కు ఎగబడుతున్న భక్తులకు, సందర్శకులకు పెద్ద షాక్ తగిలింది. అయోధ్య వైపు వెళ్లే బస్సులను రద్దు చేస్తున్నట్లు బుధవారం అక్కడి రవాణా శాఖ ప్రకటించింది. తిరిగి బస్సులు ఎప్పుడు నడుస్తాయనేది ఇప్పట్లో చెప్పలేమని స్పష్టం చేసింది. అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ట తర్వాత 'బాలక్ రామ్' దర్శనం కోసం భక్తులు ఎగబడుతున్నారు. దేశవ్యాప్తంగా అయోధ్య వైపు అడుగులేస్తున్నారు. తొలిరోజే ఏకంగా ఐదు లక్షల మంది దర్శించుకునేందుకు వచ్చినట్లు ఓ అంచనా. అందులో 3 లక్షల మంది దాకా దర్శించుకోగా.. మరో రెండు లక్షల మంది బయట ఎదురు చూస్తూ ఉండిపోయారు. ఈ క్రమంలో అధికారులకు భక్తుల నియంత్రణ కష్టతరంగా మారింది.

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

శుక్రవారం / 26. 01. 2024

https://epaper.telanganaveena.com/

AP DYNAMIC

5:00PM


## ఏపీలో నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ..

ఏపీలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం నుంచి రూ. 1,200 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. బకాయిలు విడుదల చేయాలని, పలు శస్త్ర చికిత్సల ఛార్జీలను పెంచాలని కోరుతూ ప్రభుత్వాన్ని నెట్ వర్క్ ఆసుపత్రులు కోరుతున్నప్పటికీ స్పందన రాలేదు. గత 20 రోజులుగా చర్చలు జరుపుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూలమైన హామీ రాలేదు. దీంతో, ఆరోగ్యశ్రీ సేవలను ఆసుపత్రులు నిన్నటి నుంచి నిలిపివేశాయి.

## ఎంపీగా పోటీ చేయనున్న అనిల్ ?

ఏపీలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో అధికార వైసీపీ తమ అభ్యర్థుల విషయంలో మార్పులు, చేర్పులు చేస్తోంది. ఇప్పటికే తమ అభ్యర్థుల పేర్లతో నాలుగు జాబితాలు విడుదల చేసింది. ఐదో జాబితాపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కొందరు సిట్టింగులు టికెట్లను కోల్పోగా, చాలా మంది సిట్టింగులకు స్థాన చలనం కలిగింది. తాజాగా ముఖ్యమంత్రి జగన్ తో నెల్లూరు సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, వ్యాపారవేత్త చలమలశెట్టి సునీల్ సమావేశమయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ స్థానంలో బీసీ అభ్యర్థిని నిలబెట్టే అంశంపై అనిల్ కుమార్ యాదవ్ తో జగన్ చర్చించారు. నరసరావుపేట నుంచి లోక్ సభకు పోటీ చేయాలని అనిల్ కు జగన్ సూచించారు. జగన్ ప్రపోజల్ కు అనిల్ ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. లావు శ్రీకృష్ణ దేవరాయ కమ్మ సామాజికవర్గానికి చెందినవారు. ఈసారి ఆయన ఆ స్థానంలో గెలవలేరనే నిర్ణయానికి జగన్ వచ్చేశారు. ఆ స్థానంలో బీసీని నిలబెడితే గెలిచే అవకాశం ఉందని ఆయన భావిస్తున్నారు. అందుకే, అనిల్ వైపు జగన్ మొగ్గుచూపారు.

# జనసేన పార్టీ పోటీ చేసే 2 అసెంబ్లీ స్థానాలను ప్రకటించిన పవన్



**తెలంగాణ వీణ , డైనమిక్ :** రాబోయే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనే విషయంలో మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. ఎన్ని సీట్లు తీసుకోవాలో జనసేనాని పవన్ కల్యాణ్ కు కొందరు సలహాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పవన్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్ని స్థానాలు తీసుకోవాలో తనకు తెలుసని... అది తెలియకుండానే ఇక్కడ వరకు వచ్చానా? అని ప్రశ్నించారు. కొందరు 50 తీసుకోండి, 60 తీసుకోండి అంటున్నారని... పొత్తును ఇబ్బంది పెట్టేలా కొందరు మాట్లాడుతున్నారని పవన్ అన్నారు. ఇది మంచిది కాదని హితవు పలికారు. సీట్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. మనం మూడో వంతు సీట్లను తీసుకోబోతున్నామని చెప్పారు. సీట్ల విషయంలో చంద్రబాబుపై ఒత్తిడి ఉంటుందని, అలాగే తనపై కూడా ఒత్తిడి ఉందని అన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో తాను రెండు సీట్లను ప్రకటిస్తున్నానని... రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ చేస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటారని భావిస్తున్నానని అన్నారు. సీఎం పదవి కోసం ఎవరూ ఆందోళన చెందొద్దని పవన్ చెప్పారు. జనసేన ఒంటరిగా పోటీ చేస్తే సీట్లు వస్తాయి కానీ, అధికారంలోకి రాలేమని అన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వాన్ని జనసేన ఎంతో ఇరుకున పెట్టిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలతో టీడీపీతో పొత్తు ముగియదని, భవిష్యత్తులో కూడా పొత్తు కొనసాగుతుందని తెలిపారు. ఇదే సమయంలో సీఎం జగన్ పై పవన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత చెల్లెలినే వదిలిపెట్టని జగన్... మనల్ని మాత్రం వదులుతాడా? అని ప్రశ్నించారు. జగన్ కు ఊరంతా శత్రువులే అని చెప్పారు. వైసీపీ నేతలకు కష్టాలు వస్తే తన వద్దకే రావాలని అన్నారు. సీఎం అభ్యర్థి చంద్రబాబే అని లోకేశ్ మాట్లాడిన మాటలను తాను పట్టించుకోలేదని పవన్ చెప్పారు. చంద్రబాబు సీనియర్ నేత అని, ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి అని... అందుకే ఇలాంటివి జరుగుతుంటాయని అన్నారు. ఆ వ్యాఖ్యలను సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. 2024లో వైసీపీ ప్రభుత్వం రాకూడదని అన్నారు. జగన్ పై తనకు వ్యక్తిగత కక్ష లేదని చెప్పారు.


# రిపబ్లిక్ డేలో ఆకట్టుకున్న ఏపీ , తెలంగాణ శకటాలు

**తెలంగాణ వీణ , డైనమిక్ :** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తెలుగు రాష్ట్రాల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ పోరాట యోధుల థీమ్ శకటంతో తెలంగాణ ప్రభుత్వం, విద్యా శాఖ శకటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆకర్షించాయి. పల్లెటూరు వాతావరణాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ పోరాట యోధుల థీమ్‌తో దీనిని రూపొందించారు. చాకలి ఐలమ్మ, కొమురం బీమ్ వంటి వారి పోరాటాలను గుర్తు చేసుకునేలా రూపొందించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యాశాఖ శకటం అందరినీ ఆకట్టుకుంది. డిజిటల్ ఎడ్యుకేషన్, సీబీఎస్ఈ, ఐబీ, టోఫెల్, ఫ్యూచర్ స్కిల్స్‌ను వివరిస్తూ శకటాన్ని రూపకల్పన చేశారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలకు అద్దం పట్టేలా ఈ శకటాన్ని తీర్చిదిద్దారు. ఈ శకటంపై తరగతి గదుల్లో డిజిటల్ క్లాస్ బోర్డులు, ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగించే తీరును బొమ్మలుగా రూపొందించారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నట్లు చూపించారు. ఇందుకు సంబంధించి 55 సెకండ్ల థీమ్ సాంగ్‌ను రూపొందించారు. శకటం అతిథుల ముందు నుంచి వెళ్లే సమయంలో ఈ సాంగ్ ప్రదర్శించారు. ఇస్రో ప్రదర్శించిన శకటంలో చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 మిషన్లు ఆకట్టుకున్నాయి. 500 ఏళ్ల చరిత్ర కలిగిన మహిళలతో నడుపుతున్న ఇమా కెయితల్ మార్కెట్‌ను మణిపూర్ ప్రదర్శించింది. ఉత్తర ప్రదేశ్ శకటంలో రామ్ లల్లా ఉండగా, ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహారాష్ట్ర ఆ థీమ్‌తో శకటాన్ని ప్రదర్శించింది.



# చిరు కి 'పద్మ విభూషణ్' పై రామ్ చరణ్ స్పందన

- పద్మ పురస్కారాలు ప్రకటించిన కేంద్రం
- మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషణ్
- మీరు అన్ని విధాలా అర్హులు అంటూ రామ్ చరణ్ ట్వీట్



**తెలంగాణ వీణ , డైనమిక్ :** కేంద్ర ప్రభుత్వం నిన్న పద్మ పురస్కారాలను ప్రకటించడం తెలిసిందే. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి 'పద్మ విభూషణ్' అవార్డు ప్రకటించారు. దీనిపై చిరంజీవి తనయుడు, టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ స్పందించారు.

"ప్రతిష్ఠాత్మక 'పద్మ విభూషణ్' అవార్డు అందుకోబోతున్న చిరంజీవి గారికి కంగ్రాచ్యులేషన్స్. ఈ పురస్కారానికి మీరు అన్ని విధాలా అర్హులు. భారతీయ సినిమాకు, సమాజానికి విస్తృత స్థాయిలో మీరు అందించిన సేవలు... నన్ను తీర్చిదిద్దడంలోనూ, అశేష అభిమానులకు స్ఫూర్తిగా నిలవడంలోనూ కీలకపాత్ర పోషించాయి. ఈ గొప్ప దేశంలో మీరొక నిష్కళంక పౌరుడు. చిరంజీవి గారికి ఇంతటి విశిష్ట గుర్తింపును, గౌరవాన్ని ఇచ్చినందుకు భారత కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం. ఎంతో మద్దతుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం" అంటూ రామ్ చరణ్ ట్వీట్ చేశారు.

## వెంకయ్య నాయుడు, చిరంజీవికి కేటీఆర్, జూనియర్ ఎన్టీఆర్ శుభాకాంక్షలు

**తెలంగాణ వీణ , డైనమిక్ :** పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రముఖ సినీ నటుడు చిరంజీవికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ నుంచి పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన చిందు యక్షగానం కళాకారుడు గడ్డం సమ్మయ్య, బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్ప, వేలు ఆనంద చారి, కేతావత్ సోమ్లాల్, కూరెళ్ల విఠలాచార్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ కూడా వెంకయ్యనాయుడు, చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. పద్మ అవార్డు గ్రహీతలందరినీ అభినందించారు. వారి విజయాలు రాబోయే తరాల్లో స్ఫూర్తిని రగిలించాలని ఆకాంక్షించారు.

# వైసీపీ శ్రేణులపై షర్మిల ఫైర్

**తెలంగాణ వీణ , డైనమిక్ :** ఏపీలో వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. దళితులను చంపి, డోర్ డెలివరీ చేస్తున్నారని అన్నారు. అరాచకాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని చెప్పారు. దళితులకు గుండు కొట్టించి అవమానిస్తున్నారని అన్నారు. వీటన్నింటినీ మన రాష్ట్రం చూసిందని చెప్పారు. ఎస్సీలను వేధిస్తూ... అంబేద్కర్ విగ్రహాలు పెడితే ఏం ప్రయోజనమని చెప్పారు. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై మండిపడ్డారు.

### అందరం ప్రమాణం చేద్దాం..

దళితుల కోసం కేటాయించిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను కూడా పక్కదారి పట్టిస్తున్నారని షర్మిల విమర్శించారు. ఇష్టారాజ్యంగా పాలన చేస్తున్నారని మండిపడ్డారు. దళితులు, ఇతర సామాజికవర్గాలకు చెందిన అందరూ బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని చెప్పారు. దళితులపై కపట ప్రేమను చూపిస్తున్న వారికి బుద్ధి చెప్పాలని అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందరం ప్రమాణం చేద్దామని... రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఇవ్వని పార్టీలకు మద్దతు తెలపబోమని ప్రమాణం చేయాలని చెప్పారు. స్వలాభం కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టే పార్టీలకు ఓటు వేయబోమని ప్రమాణం చేద్దామని అన్నారు.

### నా కుమారుడికి వైఎస్సార్ ఆయన తండ్రి పేరు పెట్టుకున్నారు..

తన గురించి తప్పుగా మాట్లాడుతున్న వైసీపీ నేతలపై ఆమె మండిపడ్డారు. తాను వైఎస్సార్ కుమార్తెను అయినప్పుడు... ఆయన బిడ్డ వైఎస్ షర్మిలా రెడ్డి కాకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. తన కుమారుడికి తన తండ్రి రాజశేఖరరెడ్డి ఆయన తండ్రి పేరు వైఎస్ రాజారెడ్డి అని పెట్టుకున్నారని తెలిపారు. తనకు కితాబు ఇస్తే తన విలువ ఎక్కువ కాదని, ఎవరో కితాబు ఇవ్వకపోతే తన విలువ తక్కువ కాదని అన్నారు. రాజశేఖరరెడ్డి ఆశయాలను సాధించేందుకే తాను కాంగ్రెస్ లో చేరానని చెప్పారు.

### నాపై అభాండాలు వేస్తే మీ విలువ పెరగదు..

సొంత మనిషిగా భావించిన కొండా రాఘవరెడ్డి కూడా అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. పాదయాత్ర చేస్తానని తాను భారతిని అడిగానని ఆయన అన్నారని... మీ దేవుడి మీద, మీ బిడ్డల మీద ప్రమాణం చేసి తాను అడిగానని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నిజాలు మాట్లాడితే మీ విలువ పెరుగుతుంది కానీ, ఇలాంటి అభాండాలు వేస్తే మీ విలువ పెరగదని అన్నారు. అక్రమంగా సంపాదించుకోవడానికి తన భర్తతో కలిసి జగన్ వద్దకు వెళ్లానని అంటున్నారని... ఈరోజు వరకు ఏదీ ఆశించి తన అన్న వద్దకు వెళ్లలేదని చెప్పారు. దానికి సాక్ష్యం తన తల్లి అని... దమ్ముంటే వెళ్లి ఆమెను అడగాలని అన్నారు.



# తిరుమలకు వెళ్లే భక్తులకు మరో శుభవార్త

- తిరుమల వెళ్లే భక్తులకు మరో శుభవార్త
- ఏప్రిల్ వరకు స్పెషల్ రైళ్లు పొడిగింపు

**తెలంగాణ వీణ , డైనమిక్ :** తిరుమల వెళ్లే భక్తులకు మరో గుడ్‌న్యూస్. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్ తెలిపారు. ముఖ్యంగా తిరుపతికి వెళ్లే రైళ్లను కూడా పొడిగించారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 25 వరకు పూర్ణా–తిరుపతి (07609), ఫిబ్రవరి 6 నుంచి మార్చి 26 వరకు తిరుపతి–పూర్ణా (07610).. ఫిబ్రవరి 3 నుంచి మార్చి 30 వరకు హైదరాబాద్–నర్సాపూర్ (07631), ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు నర్సాపూర్–హైదరాబాద్ (07632) రైళ్లను పొడిగించారు.

అలాగే ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు తిరుపతి–సికింద్రాబాద్ (07481).. ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 1 వరకు సికింద్రాబాద్–తిరుపతి (07482).. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 29 వరకు కాకినాడ టౌన్–లింగంపల్లి (07445).. ఫిబ్రవరి 3 నుంచి మార్చి 30 వరకు లింగంపల్లి–కాకినాడ టౌన్ (07446) రైళ్లను పొడిగించి నడపనున్నట్లు తెలిపారు. తిరుపతికి పొడిగించిన రైళ్లతో తిరుమలకు వెళ్లే భక్తులకు ఉపయోగంగా ఉంటుందని రైల్వేశాఖ భావిస్తోంది.



# ఏపీలో ఆరోగ్యశ్రీ సేవలు ఆగిపోలేదు

**తెలంగాణ వీణ , డైనమిక్ :** ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను యథావిధిగా ప్రజలకు అందిస్తామని.. సేవలు నిలిపివేస్తున్నట్లు జరుగుతోన్న ప్రచారంలో నిజం లేదన్నారు. సేవలు నిలిపివేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారానాకి తమకు ఏ సంబంధం లేదని ఏపీ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తమ అసోసియేషన్ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 1,150 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయని వాటిల్లో సేవలు నిరంతరాయంగా అందుతాయని చెప్పారు.

